క్లుప్తంగా

శ్రీవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే వైవీఆర్



శ్రీవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే వైవీఆర్

గుంతకల్లుటౌన్: వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని తిరుమలలో వెలసిన కలియుగదైవం వేంకటేశ్వరస్వామిని ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి దర్శించుకున్నారు. సోమవారం వేకువజామున ఎమ్మెల్యే వైవీఆర్ తన స్నేహితులతో కలిసి శ్రీవారిని దర్శించుకుని పూజలు చేశారు. ఆలయ పండితులు ఎమ్మెల్యేను సత్కరించి ఆశీర్వచనాలు అందించారు.

105 మందికి పింఛన్లు మంజూరు

గుత్తి: మున్సిపాలిటీలో ఈనెల నుంచి కొత్తగా 105 మందికి పింఛన్ మంజూరైనట్లు కమిషనర్ మల్లెల లక్ష్మీదేవి చెప్పారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో సోమవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. మున్సిపాలిటీకి కొత్తగా 105 పింఛన్లు మంజూరయ్యాయని, అర్హులైన వారందరికీ ప్రభుత్వం పింఛన్ ఇస్తుందన్నారు. ఇంకా ఎవరైనా అర్హులుంటే వార్డు సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

గుత్తి: పట్టణంలోని ఆర్ఎస్ రోడ్డులో కేంద్రీయ విద్యాలయం సమీపంలో సోమవారం బైక్ డివైడర్‌ను ఢీకొనడంతో ఒకరికి తీవ్రగాయాలయ్యాయి. వివరాలు.. తుగ్గలి మండలం జొన్నగిరి చెందిన శ్రీనివాసులు బైక్‌పై గుత్తికి బయలుదేరాడు. కేంద్రీయ విద్యాలయం సమీపంలోకి రాగానే బైక్ అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టాడు. తీవ్రంగా గాయపడిన అతడిని స్థానికులు ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

నేడు 'గడప గడపకూ మన ప్రభుత్వం'

పెద్దపప్పూరు: నామనాంకనపల్లి, నారాపురం గ్రామాల్లో మంగళవారం మధ్యాహ్నం 3 గంటలకు ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ఆధ్వర్యంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నారు. కార్యక్రమంలో మండంలోని అధికారులు, ప్రజాప్రతినిదులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు పాల్గొనాలని ఎమ్మెల్యే కార్యాలయ వర్గాలు కోరాయి.

నేడు కొత్త పింఛన్ల పంపిణీ

తాడిపత్రి: రూరల్ పరిధిలోని ఏఎస్ఆర్ ఫంక్షన్ హాల్‌లో మంగళవారం ఉదయం పెరిగిన పింఛన్లతోపాటు కొత్తగా మంజూరైన వారికి ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి పింఛన్ సొమ్ము అందించనున్నట్లు ఎంపీడీఓ రంగారావు ఓ ప్రకటనలో తెలిపారు. లబ్ధిదారులతోపాటు, ప్రజాప్రతినిధులు, అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొనాలని కోరారు.

బాధితుడికి ఏడీసీసీబీ మాజీ చైర్మన్ పరామర్శ

పామిడి: పామిడిలోని హెల్ఎల్‌సీ ఉద్యోగి సత్యనారాయణ ఇటీవల పక్షవాతానికి గురయ్యారు. విషయం తెలుసుకున్న ఏడీసీసీ బ్యాంకు మాజీ చైర్మన్ ఎం. వీరాంజనేయులు సోమవారం సత్యనారాయణ ఇంటికి వెళ్లి ఆయనను పరామర్శించారు. నాయకులు, రామాంజనేయులు, శీనా, శివ, షెక్షావలి, ధను ఉన్నారు.

వైఎస్సార్ క్రికెట్ టోర్నీ విజేత రైల్వే క్యాంపస్ జట్టు



విజేతలకు ట్రోఫీ అందజేస్తున్న నైరుతీరెడ్డి

గుంతకల్లు రూరల్: స్థానిక రైల్వే గ్రౌండ్ నందు 20 రోజులుగా కొనసాగుతున్న వైఎస్సార్ క్రికెట్ టోర్నీ సోమవారం ముగిసింది. జీసీసీ ఎక్స్‌ఐ జట్టుపై రైల్వే క్యాంపస్ జట్టు గెలిచింది. రైల్వే క్యాంపస్ జట్టుకు మున్సిపల్ వైస్ చైర్మన్ నైరుతీరెడ్డి ట్రోఫీ, రూ.30 వేల నగదు, జీసీసీ ఎక్స్ జట్టుకు ట్రోఫీతోపాటు రూ.20 వేల నగదు అందించారు. కార్యక్రమంలో టోర్నీ ఆర్గనైజింగ్ మేనేజర్, వైఎస్సార్‌సీపీ టౌన్ కన్వీనర్ సుంకప్ప, ఇతర నాయకులు పాల్గొన్నారు.

అయ్యప్పస్వామి గ్రామోత్సవం

పెద్దవడుగూరు: మండల కేంద్రంలో సోమవారం అయ్యప్పస్వామి గ్రామోత్సవాన్ని అయ్యప్ప మాలధారులు ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మాలధారులకు అన్నదానం ఏర్పాటు చేశారు. సాయంత్రం స్వామి గ్రామోత్సవం పురవీధుల్లో వైభవంగా జరిగింది.

సమస్యలు గుర్తించండి

గుత్తి రూరల్: మండలంలోని కొత్తపేట గ్రామ పంచాయతీ పరిధిలోని కొత్తపేట, మామిళ్లచెరువు, కొత్తపేట పాతూరులో నెలకొన్న సమస్యలను గుర్తించాలని సర్పంచ్ గురు మస్తాన్ సచివాలయ ఉద్యోగులకు సూచించారు. సోమవారం కొత్తపేట సచివాలయంలో ఉద్యోగులు, వలంటీర్లతో సర్పంచ్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుధ్యం, విద్యుత్ దీపాల ఏర్పాటు, నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు.

గోవిందా...గోవింద

- వైభవంగా ముక్కోటి ఏకాదశి
- ఉత్తర ద్వార దర్శనానికి పోటెత్తిన భక్తులు



గుత్తి: ప్రత్యేక అలంకారంలో లక్ష్మీనరసింహస్వామి



తాడిపత్రి టౌన్: వేంకటరమణస్వామికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి



శింగనమల: అలంకరణలో చెన్నకేశవుడు



బుక్కరాయసముద్రం: వేంకటరమణస్వామి



యాడికి : చెన్నకేశవ స్వామికి పూజలు నిర్వహిస్తున్న కేతిరెడ్డి రమాదేవి

గుంతకల్లు టౌన్: గోవింద నామస్మరణతో రాజేంద్రనగర్ పులకించిపోయింది. వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని రాజేంద్రనగర్‌లో వెలసిన వేంకటేశ్వరస్వామి వారిని ఉత్తరద్వారం(వైకుంఠ ద్వారం) దర్శనానికి వేలాది సంఖ్యలో భక్తాదులు పోటెత్తారు. సోమవారం తెల్లవారుజామున ఆలయ అర్చకులు శ్రీవారికి శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించిన అనంతరం వైకుంఠద్వార ప్రవేశానికి అనుమతిచ్చారు. తెల్లవారుజామున నుంచే భక్తాదులు బారులు తీరారు. తమిళనాడు వేలూరు, అంబూర్ ప్రాంతాలకు చెందిన కళాకారులు విశేష పుష్పాలతో అలంకరించారు. ఆలయ ఆవరణలో భక్తుల సందర్శనార్థం విశేషపుష్పాలతో కోనేరులో శివుడు, శంఖువులో కృష్ణుడు, అయ్యప్పస్వామి, అన్నపూర్ణేశ్వరి దేవి, మత్స్యావతారంలో శ్రీనివాసుడు, శ్రీలలితాదేవిని తీర్చిదిద్దారు. మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్.భవా, డీఎస్పీ నరసింగప్ప, కౌన్సిలరు శ్రీవారిని దర్శించుకున్నారు. ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు భాస్కర్‌రంగయ్య, నారాయణస్వామి, ఉపాధ్యక్షుడు రమేష్‌రెడ్డి, సంయుక్త కార్యదర్శి సుదర్శన్‌బాబు, సభ్యులు వెంకట్, ప్రవీణ్, వీరాంజినేయులు తదితరులు భక్తాదులకు సేవలందించారు.

కోదండరామస్వామి ఆలయంలో..

కోదండరామస్వామి ఆలయంలో భక్తాదులు ఉత్తరముఖంగా ఉన్న సీతారామ లక్ష్మణ ఆంజనేయ స్వామి ఉత్సవమూర్తులను దర్శించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో లక్షదీపార్చన జరిగింది. ఆలయ ఈఓ మఠం మల్లికార్జున సేవలందించారు.

వైభవం.. వేంకటరమణుడి గ్రామోత్సవం

తాడిపత్రి టౌన్ : గోవింద నామస్మరణతో చింతల వేంకటరమణస్వామి ఆలయం మార్మోగింది. వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని ఆలయం తెల్లవారు జాము నుంచి భక్తులతో కిటకిటలాడింది. ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డికి ఆలయ ఈఓ సుబ్రమణ్యం , చైర్మన్ బాణా నాగేశ్వరరెడి, సభ్యులు, అర్చకులు పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు. అనంతరం అమ్మవార్లు, స్వామికి ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేకు శాలువాతో సన్మానించారు. ఎమ్మెల్యే సతీమణి రమాదేవి భక్తులకు తిరుపతి లడ్డూ, అన్నవరం సత్యనారాయణస్వామి ప్రసాదలను పంపిణీ చేశారు. శ్రీదేవి, భూదేవి, చింతల వేంకటరమణస్వామి ఉత్సవ విగ్రహాలను గరుడ వాహనంపై ఊరేగించారు. కేరళ వాయిద్యాలు ఆకట్టుకున్నాయి. స్థానిక ఆలయం నుంచి గాంధీ కట్ట, మెయిన్‌బజారు, సీబీరోడ్డు వరకు గ్రామోత్సవం జరిగింది. ఆలయంలోని తులసికోట, లక్ష్మీనరసింహాస్వామి, ధ్వజస్తంభం వద్ద మహిళలు దీపాలు వెలిగించి పూజలు నిర్వహించారు. ఆలయ ఆవరణంలో నూతనంగా నిర్మించిన ఆనంద పుష్కరిణి (కోనేరు)లో వేంకటేశ్వరస్వామి విగ్రహం భక్తులను ఎంతగానో ఆకట్టుకుంది. ఆలయ కమిటీ సభ్యులు సంజన్న, భూమా హరి ,లక్ష్మీదేవి,మద్యాల లత, కనకాద్రి లక్ష్మీదేవి, రమాదేవి ఏర్పాట్లను పర్యవేక్షించారు. పట్టణంలోని రెడ్డివారిపాలెంలోని కోదండ రామరంగనాథస్వామి, మెయిన్ బజార్ కన్యకా పరమేశ్వరీదేవి ఆలయం, సాయిబాబా ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరిగాయి. ఆలాగే , ఏటిగడ్డ ఆంజనేయస్వామి ఆలయాల్లో తులసిమాలతో స్వామిని అలంకరించారు. అనంతరం భక్తులు విష్ణు సహస్రపారాయాణం చేశారు.

శింగనమల: స్థానిక చెన్నకేశవాలయంలో సోమవారం తెల్లవారుజాము నుంచే అభిషేకాలు , పూజలు జరిగాయి. అనంతరం ఉత్తర ద్వారం గుండా భక్తులు స్వామిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు ఏర్పాట్లు చేశారు.

గార్లదిన్నె: గార్లదిన్నె, మర్తాడు, కేశవాపురంలో వేంకటేశ్వరస్వామి, చెన్నకేశవ స్వామి ఆలయాల్లో సోమవారం అర్చకులు స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. స్వామి దర్శనం కోసం భక్తులు వేకుమజాము నుంచే ఆలయాల వద్ద క్యూలో ఉండి ఉత్తర ద్వార దర్శనం చేసుకున్నారు.

నార్పల: వైకుంఠ ఏకదశి సందర్భంగా సోమవారం మండల కేంద్రంలోని చెన్నకేశవస్వామి ఆలయంలో పూజలు అంగరంగ వైభవంగా జరిగాయి. అర్చకులు లక్ష్మీనారాయణ భూదేవి,శ్రీదేవి సమేత చెన్నకేశవ స్వామి మూలవిరాట్లకు అర్ధరాత్రి నుంచే అభిషేకాలు చేసి ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం భక్తాదులకు ఉత్తర ద్వార ప్రవేశం కల్పించడంతో పాటు అర్చనలు,నిత్య పూజలు జరిపించారు. సాయంత్రం 5 గంటలకు దేవాలయం నుంచి తిక్కస్వామి ఆలయం వరకు దివిటీల వెలుగులో, సన్నాయి వాయిద్యాల వాయిస్తూ పలకల కోలన్న



గుంతకల్లు టౌన్: భక్తులకు దర్శనమిచ్చిన వేంకటేశ్వరస్వామి

మధ్య స్వామి పల్లకీ ఊరేగింపు సాగింది. చివరగా రాత్రి భజన కార్యక్రమంతో స్వామి బ్రహ్మోత్సవం ముగిసింది. మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ నార్పల సత్యనారాయణరెడ్డి,పాల్గొన్నారు.

గుత్తి రూరల్: తొండపాడులోని బొలికొండ రంగనాథస్వామి, మాణిక్య రంగనాథ స్వామిలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామికి వేకువ జామునుంచి అర్చకులు రవికుమార్, చేతన్‌వర్మ, లిఖిల్ వర్మ ప్రత్యేక పూజలు చేపట్టారు. తొండపాడు ఆలయ కమిటీ చైర్మన్ వేల్పుల సోమశేఖర్ యాదవ్, ఈఓ దేవదాసు, మాణిక్య రంగనాథ స్వామి ఆలయ ధర్మకర్త మాకం శ్రీకాంత్, అధ్యక్షుడు జీవి.రామన్ ఏకాదశి వేడుకలను ప్రారంభించారు.

గుత్తి: గుత్తిలోని కోటపై వెలసిన లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో అత్యంత వైభవంగా ముక్కోటి ఏకాదశి వేడుకలు నిర్వహించారు. బెంగళూరు నుంచి ప్రత్యేకంగా పూలను తెప్పించి స్వామిని అలంకరించారు. తెల్లవారు జామున 5 గంటలకు ఉత్తర ద్వారాన్ని తెరిచారు. అన్నదానం నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు అంజి, విజయ్, నాగయ్య, శేషు, వంశీ, సురేష్ పాల్గొన్నారు.

బుక్కరాయసముద్రం: మండల కేంద్రంలోని ప్రముఖ వైష్ణవ ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కొండమీద వేంకటరమణ స్వామి ఆలయం, దేవర కొండపై వెలసిన కొండమీద రాయుడు, పురాతన లక్ష్మీనారాయణస్వామి ఆలయంలో అర్చకులు స్వామిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేపట్టారు. ఉత్తర ద్వారం గుండా భక్తులు స్వామిని దర్శించుకున్నారు.

యల్లనూరు: యల్లనూరు, కల్లూరు, వెన్నపూసపల్లి తదితర గ్రామాల్లో వెలసిన వేంకటేశ్వరస్వామికి ముక్కోటి ఏకాదశి సందర్భంగా సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో స్వాములను దర్శించుకున్నారు.

యాడికి: మండల కేంద్రంలోని పురాతన శివలక్ష్మీ చెన్నకేశవ స్వామి ఆలయంలో సోమవారం చెన్నకేశవ నామస్మరణతో ఆలయం పోటెత్తింది. ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి సతీమణి రమాదేవి స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. చెన్నకేశవుడి ఆలయ విశిష్టతను అర్చకుడు హరికృష్ణ శర్మ ఎమ్మెల్యే సతీమణికి వివరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ రామిరెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు వెంకటరామిరెడ్డి, తలారీ నాగేష్, భోగా లక్కట్ట హనుమంతరెడ్డి పాల్గొన్నారు.

పామిడి: పట్టణంలోని అనంత గజగరుడ లక్ష్మీనారాయణస్వామి, విఠోబా ఆలయాల్లో సోమవారం వైకుంఠ ఏకాదశి వేడుకలను వైభవంగా నిర్వహించారు. ఈసందర్భంగా శ్రీదేవి, భూదేవి సమేత లక్ష్మీనారాయణస్వామి, రుక్మిణి పాండురంగస్వామి దేవతామూర్తులకు ప్రత్యేక పూజలు జరిగాయి. భక్తులు ఉత్తర ద్వారం ద్వారా దర్శనం చేసుకున్నారు. అనంతరం శ్రీదేవి, భూదేవి సమేత లక్ష్మీనారాయణ స్వామి ఉత్సవ విగ్రహాలకు ప్రాకారోత్సవం గావించారు. రంగసుబే ఫిర్కా ఆధ్వర్యంలో రుక్మిణీ పాండురంగస్వామి ఉత్సవ విగ్రహాలకు గ్రామోత్సవం నిర్వహించారు.

పెద్దవడుగూరు : పెద్దవడుగూరు, చిన్నవడుగూరు, కోటకొండ, లక్ష్మంపల్లి, మల్లేనిపల్లిలో ఏకాదశి వేడుకలు ఘనంగా నిర్వహించారు.



బుక్కరాయసముద్రం: ఉత్తర ద్వార దర్శనం కోసం క్యూలో భక్తులు



తాడిపత్రి టౌన్: చింతల వేంకటరమణుడిని దర్శించుకుంటున్న భక్తులు



నార్పల : పల్లకీలో చెన్నకేశవుడు

అర్హులందరికీ సాగు పట్టాలు

యాడికి: అర్హులందరికీ సాగు పట్టాలు అందజేస్తామని తహసీల్దార్ అలెగ్జాండర్ పేర్కొన్నారు. తహసీల్దార్ కార్యాలయం ఎదురుగా సోమవారం మండల వ్యాప్తంగా 420 మంది భూమిలేని నిరుపేదలు సాగు చేస్తున్న అసైన్‌మెంట్ భూములకు పట్టాలు ఇవ్వాలని నిరసన వ్యక్తం చేశారు. దీంతో గుత్తి, తాడిపత్రి పోయే వాహనాలు రోడ్డుపై నిలబడటంతో ట్రాఫిక్ పూర్తిగా స్తంభించింది. రూరల్ సీఐ రామకృష్ణ, ఇన్‌చార్జ్ ఎస్‌ఐ రాజశేఖర్ రెడ్డి ఘటనా స్థలానికి చేరుకుని రైతులకు సర్దిచెప్పారు. అయినా వారు ససేమీరా అనడంతో సమస్యను తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్లారు. అర్హులందరికీ న్యాయం చేస్తామని తహసీల్దార్ హామీ ఇవ్వడంతో వారు ఆందోళన విరమించారు.

జల జీవన్ మిషన్‌తో ప్రతి ఇంటికీ కుళాయి

గుత్తి రూరల్: గ్రామాల్లో జల జీవన్ మిషన్ ద్వారా ప్రతి ఇంటికీ తాగునీటి కుళాయి కనెక్షన్ ఇస్తామని ఎంపీపీ గాండ్లపాటి విశాలాక్షి పేర్కొన్నారు. సోమవారం పూలకుంట గ్రామంలో ఎంపీపీ, సర్పంచ్ సుమలత జల్ జీవన్ మిషన్ పనులను భూమి పూజ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ గ్రామాల్లో రక్షిత తాగునీరు అందించేందుకు జల జీవన్ మిషన్ ద్వారా నూతన పైపు లైన్లు వేసి ప్రతి ఇంటికి కుళాయి ఇస్తామన్నారు. కుళాయిల ద్వారా రోజూ నీటిని అందిస్తాన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గోవర్ధన్‌రెడ్డి, మాజీ సర్పంచ్ కొండయ్య, వైఎస్సార్‌సీపీ నాయకులు సంజీవరెడ్డి, తిమ్మప్ప, రాజశేఖర్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

నేడు సచివాలయ కన్వీనర్లు, వలంటీర్ల సమావేశం

శింగనమల: నియోజకవర్గంలోని గార్లదిన్నె, శింగనమల, బుక్కరాయసముద్రం మండల కేంద్రాల్లో సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లతో మంగళవారం సమావేశాలు నిర్వహించనున్నారు. సమావేశాలకు ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నర్సింహయ్య హాజరుకానున్నారు. ఉదయం 9 గంటలకు గార్లదిన్నె, మధ్యాహ్నం 12 గంటలకు శింగనమల, 3 గంటలకు బుక్కరాయసముద్రంలో సమావేశాలు నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ నాయకులు తెలిపారు. కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు, వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొనాలని కోరారు.

చీనీ మొక్కల నరికివేత

యల్లనూరు: మండల కేంద్రంలోని సాయిబాబా గుడి వద్ద వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీ తిమోతి సాగు చేసిన 10 చీనీమొక్కలను గుర్తు తెలియని వ్యక్తులు నరికివేసినట్లు బాధిత రైతు పోలీసులకు ఫిర్యాదు చేశారు. హెడ్‌కానిస్టేబుల్ వెంకటరాముడు, స్పెషల్ బ్రాంచ్ హెడ్‌కానిస్టేబుల్ ఓబులేసు బాధితుడితో వివరాలు సేకరించారు. నరికిన చీనీచెట్ల వద్ద మద్యం బాటిళ్లు ఉండటంతో ఆకతాయిలు ఇలా చేసినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు.

బాధితుడికి పరామర్శ

గుంతకల్లు రూరల్: ఇటీవల ప్రమాదంలో గాయపడి పట్టణంలోని లైఫ్‌లైన్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత సుంకిరెడ్డిని సోమవారం సాయంత్రం మున్సిపల్ వైస్ చైర్మన్ నైరుతీరెడ్డి పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. నాయకులు కిసాన్‌సెల్ జిల్లా కార్యదర్శి సోమిరెడ్డి, మాజీ ఎంపీటీసీ జయరామిరెడ్డి, ఓబుళాపురం సర్పంచ్ రమేష్‌రెడ్డి ఉన్నారు.

యల్లనూరు ఎస్‌ఐగా రామకృష్ణ

యల్లనూరు: యల్లనూరు ఎస్‌ఐగా రామకృష్ణ సోమవారం బాధ్యతలు తీసుకున్నారు. ఇక్కడ పని చేసిన ఎస్‌ఐ ధోని వెంకట రవికిరణ్ అక్టోబరు 17 నుంచి గ్రూప్ 1 శిక్షణ నిమిత్తం దీర్ఘకాలిక సెలవుపై వెళ్లారు. దీంతో వీఆర్‌లో ఉన్న రామకృష్ణను ఇక్కడికి బదిలీ చేశారు.

శ్రీవారి సన్నిధిలో ఎమ్మెల్యే దంపతులు



శ్రీవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి దంపతులు

శింగనమల: వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని తిరుమల వేంకటేశ్వర స్వామిని సోమవారం తెల్లవారుజామున ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి , ప్రభుత్వ విద్య సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి కుటుంబ సభ్యులు దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు ఎమ్మెల్యే దంపతులకు స్వామి ఆశీర్వచనాలు అందజేశారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

- ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి

శింగనమల: ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కుల మతం, పార్టీ భేదం లేకుండా ముఖ్యమంత్రి వైఎస్ జగనన్న అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నారని ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి అన్నారు. కొత్తగా మంజూరైన పింఛన్‌దారులకు సోమవారం శింగనమల ఎంపీడీఓ కార్యాలయంలో పింఛన్లు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పింఛన్లలో కోత విధిస్తున్నారని దుష్టచతుష్టయం ఎంతో గగ్గోలు పెడుతోందని, శింగనమల మండలంలోనే గత నెల కంటే 200 మందికి పింఛన్లు ఎక్కువ వచ్చాయన్నారు. టీడీపీ ప్రభుత్వంలో జన్మభూమి కమిటీలు, టీడీపీ నాయకులు చెప్పిన వారికే పింఛన్లు మంజూరు చేశారన్నారు. కాని జగనన్న సచివాలయ వ్యవస్థ ద్వారా నేరుగా వలంటీర్ గడపవద్దకే వచ్చి పథకాలు అందిస్తున్నారన్నారు.

ప్రాణాలతో చలగాటం ఆడుతున్న చంద్రబాబు:

జగనన్న ముఖ్యమంత్రి అయినప్పటి నుంచి చంద్రబాబు తిట్టడమే పనిగా పెట్టుకున్నారని ఎమ్మెల్యే విమర్శించారు. జగనన్న ఎన్నో బహిరంగలు పెట్టారని, లక్షలు మంది కలిసినా ఎక్కడా ఒక్క చిన్న పొరపాటు కూడా జరగలేదన్నారు. కాని చంద్రబాబు చేపట్టిన రెండు సభల్లో ప్రచార పిచ్చితో ప్రజల ప్రాణాలతో చెలగాటమాడారన్నారు. చంద్రబాబు నాయుడు పాలనలో వర్షాలు లేక తాగడానికే ఎన్నో ఇబ్బందులు పడ్డారని, కాని జగనన్న పాలనలో వర్షాలు కురిసి , నీటి సమస్య లేకుండా పోయిందన్నారు. శింగనమల చెరువు లోకలైజేషన్ చేయంచామని, నేటికీ చెరువు మరువ పారుతున్నదన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి జగనన్న ఎంతో చేయూతనందిస్తున్నారన్నారు. డీసీఎంఎస్ డైరెక్టర్ శ్రీరామిరెడ్డి, ఎంపీపీ యోగేశ్వరి, వైస్ ఎంపీపీ నరసింహులు, వైఎస్సార్‌సీపీ నాయకులు కంచిరెడ్డి భాస్కర్‌రెడ్డి, ఎంపీటీసీలు మెరార్జీ, ఉమా, సరోజమ్మ, సర్పంచ్‌లు ఆదినారాయణరెడ్డి, మండల కోఆప్షన్ మెంబర్ బంగారు ఆలీ, మండల స్పెషల్ ఆఫీసర్ ఉమాశంకరమ్మ, తహసీల్దార్ ఈశ్వరమ్మ, ఎంపీడీఓ నిర్మలాకుమారి, నాయకులు నగేష్, నరసయ్య పాల్గొన్నారు.



పింఛన్ సొమ్ము అందిస్తున్న ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి

నవరత్నాలతో అన్నివర్గాలకు మేలు

- ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి

పెద్దపప్పూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన నవరత్నాల పథకాలతో అన్నివర్గాల ప్రజలకు ఎంతో మేలు జరుగుతోందని ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి అన్నారు. సోమవారం అమ్మలదిన్నెలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన ఇంటింటికీ వెళ్లి మూడున్నరేళ్లలో ఆయా కుటుంబాలకు అందించిన లబ్ధిని వివరించారు. సంక్షేమ పథకాలు సకాలంలో సక్రమంగా అందుతున్నాయని లబ్ధిదారులు ఎమ్మెల్యే వద్ద ఆనందం వ్యక్తం చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో రాజకీయాలకు అతీతంగా అన్నివర్గాలకు సంక్షేపథకాలు అందిస్తున్నామన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎలాంటి సిఫారసు లేకుండా అర్హతే ప్రామాణికంగా గడప వద్దకే సంక్షేమ పథకాలు అందిస్తున్నారన్నారు. ప్రతినెలా ఏదో సంక్షేమ పథకం ద్వారా అర్హుల ఖాతాల్లో డబ్బు జమ చేస్తున్నారన్నారు. దీన్ని ఓర్వలేక ప్రతిపక్షాలు ప్రభుత్వంపై బురదజల్లేందుకు యత్నిస్తున్నాయన్నారు. ప్రజలు ఇలాంటి వారికి ఓటుతో బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. మరోసారి జగనన్నను సీఎంగా గెలుపించుకుందామని కోరారు. ఈసందర్భంగా పలు సమస్యలను స్థానికులు విన్నవించగా స్పందించిన ఎమ్మెల్యే ఆయా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు కార్యక్రమంలో ఎంపీపీ రామ్మూర్తి రెడ్డి, వైస్ ఎంపీపీ రామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు వరదాయపల్లి శివారెడ్డి, చిక్కేపల్లి రామేశ్వర్ రెడ్డి, శ్రీనివాసరెడ్డి, ముచ్చుకోట అమర్‌నాథ రెడ్డి, ఎంపీటీసీ శకుంతల, సర్పంచు రాగిపిండి గౌతమి, స్థానిక నేతలు రామచంద్రారెడ్డి, శివశంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సంక్షేమ పథకాల బ్రోచర్ అందిస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి

ఆర్‌యూ విద్యార్థి ఆత్మహత్యాయత్నం

కర్నూలు సిటీ: రాయలసీమ యూనివర్సిటీలో బీటెక్ (మెకానికల్)థర్డ్ ఇయర్ విద్యార్థి పురుగుల మందుతాగి ఆత్మహత్యకు యత్నించాడు. వివరాలు ఇలా.. గుంతకల్లుకు చెందిన స్వామినాయక్, బీమి నాయక్ దంపతులకు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు. ఓ కూతురు చనిపోగా, మరో కూతురుకు వివాహమైంది. ఒక్కగానొక కుమారుడు సురేష్‌ను ప్రయోజకుడిని చేయాలనే ఉద్దేశంతో తల్లిదండ్రులు వ్యవసాయ పనులు చేస్తూ చదివిస్తున్నారు. అయిష్టంగానే బీటెక్‌లో చేరిన ఈ విద్యార్థికి సెకండ్ ఇయర్‌లో అమ్మాయిలకు సంబంధించిన అంశంలో కాలేజీ ప్రిన్సిపాల్ పేరెంట్స్ సమక్షంలో కౌన్సెలింగ్ ఇచ్చారు. అయినా, విద్యార్థి తన ప్రవర్తన మార్చుకోకపోగా రోజూ రాత్రి వేళల్లో ఫోన్లలో మాట్లాడుతూ కనిపించేవాడు. ఆదివారం రాత్రి కూడా కాలేజీ భవనం వద్ద మాట్లాడుతూ కనిపించడంతో హాస్టల్‌లో పని చేసే ఓ వ్యక్తి గమనించి హాస్టల్‌కు వెళ్లి చదువుకోమని సూచించాడు. అందుకు నా ఇష్టమని సమధానం చెప్పిన సదరు విద్యార్థి తర్వాత పసుపుల గ్రామానికి వెళ్లి ఫర్టిలైజర్ దుకాణంలో పురుగుల మందు తెచ్చుకున్నాడు. ఉదయం అందరూ టిఫిన్ చేసి కాలేజీకి వెళ్లేందుకు రెడీ అవుతున్న సమయంలో సురేష్ పురుగుల మందు తాగాడు. హాస్టల్ సిబ్బంది, విద్యార్థులు గమనించి వెంటనే 108 అంబులెన్స్‌లో పెద్దాసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న వర్సిటీ వీసీ ఆచార్య ఆకెపోగు ఆనందరావు, రిజిస్ట్రార్ మధుసూదన్ వర్మలతో పాటు మరి కొందరు ఆసుపత్రికి వెళ్లి విద్యార్థిని పరామర్శించారు. విద్యార్థి ఆరోగ్యం నిలకడగానే ఉన్నట్లు వైద్యులు తెలిపారు.

వాహన యజమాని చికిత్స చేయించలేదని నిరసన

తాడిపత్రి: ఐచర్ వాహన యజమాని గాయపడిన క్లీనర్‌కు చికిత్స చేయించలేదని, ఆగ్రహించిన కుటుంబ సభ్యులు సోమవారం తాడిపత్రి – గుత్తి రహదారిపై చుక్కలూరు వద్ద బైఠాయించారు. వివరాలు... చుక్కలూరు గ్రామానికి చెందిన గోపాల్ అదే గ్రామానికి చెందిన ఐచర్ వాహన యజమాని రామాంజి వాహనానికి డ్రైవర్‌గా వెళ్లేవాడు. ఈ క్రమంలో గతేడాది డిసెంబర్ 30న సత్యసాయి జిల్లా, ముదిగుబ్బ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో క్లీనర్ గోపాల్ తీవ్రంగా గాయపడ్డాడు. కుటుంబ సభ్యులు బెంగళూరులో చికిత్స అనంతరం కర్నూలుకు తీసుకొచ్చారు. కానీ ఇప్పటి వరకు వాహన యజమాని ఎలాంటి సాయం అందించలేదు. దీంతో ఆగ్రహించిన భార్య జయలక్ష్మమ్మ, కుమారుడు, కుమార్తె, బంధువులతో కలిసి రహదారిపై బైఠాయించి నిరసన తెలిపారు. విషయం తెలుసుకున్న రూరల్ ఎస్‌ఐ మహమ్మద్ గౌస్ సంఘటనా స్థలానికి వెళ్లి వారికి సర్దిచెప్పి ఆందోళన విరమింపజేశారు.

ఉద్యాన రైతులకు ప్రభుత్వం చేయూత

శింగనమల: ఉద్యాన పంటలు పండించే రైతులకు ప్రభుత్వం చేయూతనిస్తోందని డీసీఎంఎస్ డైరెక్టర్ శ్రీరామిరెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండలంలోని వెస్ట్ నరసాపురంలో ఉద్యాన శాఖ ద్వారా దోణరామేశ్వర రైతు సంఘానికి మంజూరైన కలెక్షన్ సెంటర్ భవనం నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ప్రతి గ్రామంలో రైతు ఉత్పత్తిదారుల సంఘాలుగా ఏర్పడితే పంట ఉత్పత్తి సమయంలో ధర తక్కువగా ఉంటే ఈ కేంద్రాల్లో నిల్వ చేసుకొని, ధర వచ్చినప్పుడు అమ్ముకోవచ్చన్నారు. భవన నిర్మాణాలకు ఉద్యాన శాఖ 75 శాతం రాయితీ ఇస్తున్నట్లు తెలిపారు.



భూమి పూజ చేస్తున్న శ్రీరామిరెడ్డి